క్లుప్తంగా

పొగాకు అమ్మకాలు

ఒంగోలు రూరల్: పొగాకు వేలం కేంద్రం–2లో శుక్రవారం 1037 బేళ్ళు అమ్మకాలు జరిగాయి. వేలం కేంద్రానికి మొత్తం 1067 బేళ్ళు రాగా 2 బేళ్ళు నోబిడ్ బేళ్ళుగా అయ్యాయి. గరిష్ట ధర రూ.200, కనిష్ట ధర రూ.165, సరాసరి ధర 194.53 గా నమోదయినట్లు వేలం నిర్వహణ అధికారి కె.రామకృష్ణ తెలిపారు.

మద్దిపాడులోకి నాగులుప్పలపాడు అంగన్‌వాడీ సెంటర్లు

మద్దిపాడు: మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి నాగులుప్పలపాడు అంగన్‌వాడీ సెంటర్లు వచ్చినట్లు సీడీపీవో ఇవాంజిలిన్ తెలిపారు. ఆ మేరకు ఈ నెల 19వ తేదీ జిల్లా శిశుసంక్షేమ శాఖ అధికారిణి ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. ఇప్పటి వరకు వేటపాలెం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉన్న నాగులుప్పలపాడు సూపర్‌వైజర్లు మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని జిల్లా ఐసీడీఎస్ అధికారిణి ధనలక్ష్మి ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇప్పటి వరకూ సంతనూతలపాడు నియోజకవర్గంలోని సంతనూతలపాడు, చీమకుర్తి, మద్దిపాడు మండలాలలో 212 అంగన్‌వాడీ సెంటర్లు ఉండగా, వాటిలో పేర్నమిట్ట పరిధిలో ఉన్న 13 సెంటర్లు ఒంగోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి వెళ్లాయి. నాగులుప్పలపాడు మండలంలోని 87 అంగన్‌వాడీ సెంటర్లు ప్రస్తుతం మద్దిపాడు ప్రాజెక్ట్ పరిధిలోకి వచ్చాయి. మొత్తం 286 అంగన్‌వాడీ సెంటర్లు మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోకి రానుండగా, నూతనంగా మద్దిపాడు ప్రాజెక్టుకు అడిషనల్ సీడీపీవో పోస్టు ఒకటి రానున్నట్లు సీడీపీవో తెలిపారు. ఈ మేరకు జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో చీమకుర్తిలో 6 మినీ, మద్దిపాడులో 1, సంతనూతలపాడులో 3 మినీ అంగన్‌వాడీ సెంటర్లు ఉన్నాయని, మిగిలిన 276 సెంటర్లు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లుగా ఉన్నాయని ఆమె తెలిపారు.

భీమనాథం హనుమా రెడ్డి జయంతి రేపు

ఒంగోలు: జిల్లా రచయితల సంఘం మాజీ అధ్యక్షులు, సీనియర్ న్యాయవాది భీమనాథం హనుమారెడ్డి 82వ జయంతి కార్యక్రమం ఆదివారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో నిర్వహించనున్నారు. ఈమేరకు ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం డీన్ డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక రాజాపానగల్ రోడ్డులోని ప్రకాశం జిల్లా రచయితల సంఘం కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరి వెంకట శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రముఖ అభ్యుదయ కవి సాహితీ విమర్శకులు, పొట్టిశ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణకు భీమనాథం హనుమారెడ్డి స్మారక సాహిత్య పురస్కారం – 2023 ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. సుప్రసిద్ధ కవులు డాక్టర్ యు.దేవపాలన, కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వీవీ శేషయ్య, బీఈడీ కృష్ణయ్య, పిన్ని వెంకటేశ్వర్లు, వి.ఝాన్సీ దుర్గలకు హనుమారెడ్డి స్మారక ఆత్మీయ సాహిత్య పురస్కారాలు అందిస్తున్నామన్నారు. సాహిత్య ఉపన్యాసంలో భాగంగా డాక్టర్ ఎస్‌వీ సత్యన్నారాయణ అభ్యుదయ సాహిత్యం నాడు–నేడు అనే అంశం మీద ప్రసంగిస్తారన్నారు. సంఘ ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ ముఖ్య అతిథిగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, విశిష్ట అతిథిగా ఏపీ ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు నల్లూరి వెంకటేశ్వర్లు పాల్గొంటారన్నారు. జిల్లా రచయితల సంఘం సభ్యులు మూఢమంచు వెంకటేశ్వర్లు, పాలూరి శివప్రసాద్, న్యాయవాదులు జి.రవీంద్రారెడ్డి, సీహెచ్ సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని జయప్రదం చేయండి

చీమకుర్తి: ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ పిలుపునిచ్చారు. సంతనూతలపాడు నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశాన్ని కోటి ఆధ్వర్యంలో శుక్రవారం చీమకుర్తిలో నిర్వహించారు. రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో ఈ నెల 28న అద్దంకిలో జిల్లాస్థాయిలో ఏర్పాటు చేస్తున్న సమావేశానికి తరలిరావాలని కోటి పిలుపునిచ్చారు. మల్లెల ప్రసాద్, బక్కా రాజు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

కొత్తపట్నం: గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు త్వరగా చేయాలని జాయింట్ కలెక్టర్ కె.శ్రీనివాసులు పేర్కొన్నారు. బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా కొత్తపట్నం లేఅవుట్లను శుక్రవారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో ముఖా ముఖి మాట్లాడారు. ఇక్కడ లేఅవుట్లు ఎన్ని ఉన్నాయి? ఎంత మందికి పట్టాలు ఇచ్చారు? ఎంత మంది ఇళ్ల నిర్మాణం చేపట్టారు? అని తహసీల్దార్ బీవీ రమణారావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ 334 లేఅవుట్లు వేశామని, 274 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని చెప్పారు. హౌసింగ్ పీడీ ఇ.పేరయ్య వివరాలు వెల్లడించారు. బీఎల్ స్టేజీలో ఎందుకు ఎక్కువగా ఉన్నాయని జేసీ ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీలు ఎక్కువగా ఉన్నందున అదనంగా డబ్బులు వేసుకుని కట్టుకునే స్తోమత లేక ఆగాయని చెప్పారు. ఎస్సీ, ఎస్టీలకు ఇంటి నిర్మాణానికి ఎన్జీవో, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ కలయిక ద్వారా సహాయం అందించి గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. డ్వాక్రా గ్రూపుల ద్వారా 168 మందికి రూ.35 వేలు బ్యాంక్‌ల ద్వారా ఇప్పించడం జరిగిందని, మిగత వారు గ్రూపులో లేనందున ఇప్పించలేకపోయామని ఏపీఎం షేక్ రజీయా సుల్తాన్ బేగం జేసీకు వివరించారు. జగనన్న లేఅవుట్లకు గృహ నిర్మాణం చేపట్టాలంటే వారం రోజుల నుండి నీరు రావటం లేదని లబ్ధిదారులు జేసీకి విన్నవించుకున్నారు. ప్యానల్ బోర్డు కాలిపోయినందున నీరు రావటం లేదని తెలపగా నేటి సాయంత్రానికి బోర్డు బిగించి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రమాదేవి, హౌసింగ్ ఏఈ నాంచార్లరెడ్డిని ఆదేశించారు. హౌసింగ్ డీఈ నారాయణరెడ్డి, మండల ప్రత్యేక అధికారి అర్చన, ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, పంచాయతీ కార్యదర్శి సునీత తదితరులు పాల్గొన్నారు.



కొత్తపట్నంలో జగనన్న లేఅవుట్లను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

ఒక్క పూటలో నీరు విడుదల

కొత్తపట్నం: జేసీ ఆదేశాలతో జగనన్న లేఅవుట్లకు బోరు నీరు వచ్చాయి. జేసీ కె.శ్రీనివాసులు శుక్రవారం కొత్తపట్నం జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. నీటి విషయం తెలుసుకొని సాయంత్రానికి నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించడంతో తహసీల్దార్ బీవీ రమణారావు, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ రమాదేవి, హౌసింగ్ ఏఈ ఏ.నాంచార్లరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బోరు మెకానిక్, ఎలక్ట్రికల్ మెకానిక్‌లను తీసుకొచ్చి పరిశీలించారు. లో ఓల్టేజీ వల్ల ప్యానల్ బోర్డు కాలిపోయిందని అందువలన ప్యానల్ బోర్డు వేసుకోవాలని మెకానిక్ చెప్పాడు. లైన్‌మేన్ కోటేశ్వరావును పిలిపించి స్తంభంపై ఉన్న కండక్టర్ వైరును బాగు చేయించారు. 70 అడుగుల లోతులో ఉన్న మోటార్‌ను బయటకు లాగించి రిపేరు చేయించారు. కొత్త వైరు, ప్యానల్ బోర్డు, కేబుల్ వైరు వంటి రూ.15 విలువ చేసే సామగ్రిని కొనుగోలు చేసి కొత్తవి అమర్చారు. పైపులైన్ కూడా రిపేరు చేయించారు. దీంతో జగనన్న లేఅవుట్లకు వెళ్లి ట్యాంక్‌లకు చేరుకున్నట్లు లబ్ధిదారులు, తహసీల్దార్ చెప్పారు. ఒక్క పూటలో సమస్య పరిష్కారం చేసిన జేసీ, తహసీల్దార్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ, హౌసింగ్ అధికారులందరికీ లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



ఒక్క పూటలో రిపేరు చేసి జగనన్న లేఅవుట్లకు నీరు పంపించిన అధికారులు

కొత్తపట్నం: మండలంలో ఉన్న ప్రధానమైన సమస్యలను మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ళ రవీంద్రరెడ్డి శుక్రవారం జేసీ జేసీ శ్రీనివాసులుకు వివరించారు. కలెక్టర్ కార్యాలయంలోకి వెళ్లి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు.

‘పవనాంధ్ర అభివృద్ధి’ వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: పవనాంధ్ర అభివృద్ధి సమితి వాల్‌పోస్టర్‌ను స్థానిక శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం స్థానిక శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. చిరుప్రాయంలోనే దివంగతుడైన కుమారుడు ఈదుపల్లి సాయిపవన్ కుమార్ జ్ఞాపకార్థం ఈదుపల్లి గురునాథరావు సంస్థను ఏర్పాటు చేయడాన్ని బాలినేని అభినందించారు. గురునాథరావు మాట్లాడుతూ సేవా సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు ఉచిత న్యాయ సేవలు కూడా అందించనున్నట్లు తెలిపారు. ప్రసన్నాంజనేయ దేవస్థానం కమిటీ అధ్యక్షులు ఈదుపల్లి దశరథరామారావు, ప్రసన్న చెన్నకేశవస్వామి ధర్మకర్తల మండలి సభ్యులు కుర్రా ప్రసాద్‌బాబు, పుచ్చకాయల గోవర్ధన్‌రెడ్డి, కరేటి కిరణ్‌బాబు, 32వ డివిజన్ కార్పొరేటర్ తాడి కృష్ణలత, వైఎస్సార్ సీపీ నాయకులు ఓగిరాల వెంకట్రావు, కటారి శంకర్, గంటా రామానాయుడు, గోలి తిరుపతిరావు, వల్లెపు మురళి, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కళ్ల గుంట వెంకట కృష్ణ పాల్గొన్నారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో అన్నదానం

ఒంగోలు: స్థానిక బధిరుల ఆశ్రమ పాఠశాలలో స్థానిక శాసన సభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఒంగోలు నగరపాలక సంస్థ కోఆప్షన్ మెంబర్ షేక్ రషీద, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగూర్‌ల పెళ్ళిరోజుతో పాటు రంజాన్ పండగను పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ పెళ్ళిరోజు, రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని బధిర విద్యార్థులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో 200 మంది ఉండేందుకు అవకాశం ఉన్నా కేవలం 80 మంది మాత్రమే ఉన్నారని, ఇంకా ఎక్కువ మంది చేరాల్సిన అవసరం ఉందన్నారు. నాడు– నేడు కింద పై అంతస్తు నిర్మాణం జరుగుతుందని, త్వరలో అదికూడా అందుబాటులోకి వస్తుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు అన్ని సదుపాయాలతో పాటు నూతన భవనాలు కూడా నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పంప్రసాద్, వైఎస్సార్ సీపీ మహిళా జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, బీసీ నాయకులు కటారి శంకర్, గంటా రామానాయుడు, పెద్దిరెడ్డి భాస్కరరెడ్డి, డివిజన్ కార్పొరేటర్ ఈదర సురేష్‌బాబు, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, కార్పొరేటర్లు యనమల నాగరాజు, పెద్దిరెడ్డి నియంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ బధిరుల పాఠశాలలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా



స్వీట్లు పంపిణీ చేస్తున్న సయ్యద్ జలీల్



రంజాన్‌తోఫా పంపిణీచేస్తున్న హజ్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ బాషా

ఒంగోలు: రంజాన్ పండగను పురస్కరించుకుని ఎంఎల్‌ఏ బాలినేని శ్రీనివాసరెడ్డి ఆశీస్సులతో 25వ డివిజన్ బాలాజీ పేటలో వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సయ్యద్ జలీల్ స్వీట్లు పంపిణీ చేశారు. ఏఎంసీ డైరెక్టర్ ఎస్.కె ఇనయతుల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్పొరేటర్ బేతంశెట్టి శైలజ, జిల్లా అధికార ప్రతినిధి ఎస్.కె సైదా, ఖాదర్ బాషా, కరిముల్లా, శ్రీకాంత్‌రెడ్డి, ప్రకాష్, సోయల్ పాల్గొన్నారు.

హజ్ కమిటీ డైరెక్టర్ ఆధ్వర్యంలో..

పాత మార్కెట్ సెంటర్లో హజ్ కమిటీ డైరెక్టర్ మొహమ్మద్ బాషా కార్యాలయంలో.. పేద ముస్లింకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ఆదేశాలమేరకు రంజాన్ తోఫా అందించారు. ప్రకాశం జిల్లా మర్కస్ మసీదు ఆధ్వర్యంలో, దివంగత మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ సయ్యద్ నజీర్‌బాయ్ కుమారుడు సయ్యద్ రఫీ (వైఎస్సార్ సీపీ కతార్ దేశ సభ్యుడు) సహకారంతో 500 మందికి అందించారు. మొహమ్మద్ బాషా మాట్లాడుతూ ముస్లింలకు మక్కా యాత్ర చేసేందుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మతపెద్దలు సయ్యద్ హమీద్, నాయకులు ఎస్.కె సైదా, షేక్ జుబేర్, ఎస్‌కె కరిముల్లా (కోలా), మదీనా మసీద్ వలి, కరాటే కరిముల్లా పాల్గొన్నారు.

చీరలు పంపిణీ

బీజేపీ మైనార్టీ మోర్చా మాజీ రాష్ట్ర అధ్యక్షులు, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు షేక్ ఖలీఫాతుల్లా బాషా పంపిణీ చేశారు. పండుగ ఖర్చుల కింద కొంత ఆర్థిక సాయం చేశారు.ఆదిల్ ఇన్నోవేషన్ క్లబ్ చైర్మన్ షేక్ ఆదిల్, డైరెక్టర్ షేక్ ఆహీత్ పాల్గొన్నారు.

రేపు ప్రగడ కోటయ్య విగ్రహావిష్కరణ

చీమకుర్తి: చేనేత బంధు, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రగడ కోటయ్య విగ్రహాన్ని ఈ నెల 23వ తేదీ చీమకుర్తి చేనేత సొసైటీ భవన ప్రాంగణంలో ఆవిష్కరించనున్నట్లు చీమకుర్తి మండల పద్మశాలీయుల సంఘ సభ్యులు శుక్రవారం తెలిపారు. కర్నూలు ఎంపీ సింగరి సంజీవ కుమార్, ఎమ్మెల్సీ పోతుల సునీత, మురుగుడు హనుమంతురావు, పంచుమర్తి అనూరాధ, ఆప్కో రాష్ట్ర చైర్మన్ గంజి చిరంజీవి, పద్మశాలీయుల రాష్ట్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మితో పాటు పద్మశాలీయుల సంఘానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని చీమకుర్తి మండల పద్మశాలీయులకు విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు కొండా వెంకట మోహన్‌రావు, ఎన్.హరిప్రసాద్, సోమా యానాది శెట్టి, అవ్వారు ఆదినారాయణ, దోమల పుల్లయ్య, గోపురపు చంద్ర, స్థానికులు కోరారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండండి

ఒంగోలు రూరల్: వేసవిలో వడగాల్పులు, ఉష్ణోగ్రత క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో అన్ని వయస్కుల వారు వేసవి జాగ్రత్తలు పాటించాలని మండల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.వాణి అన్నారు. మండలంలోని కరవది పీహెచ్‌సీలో శుక్రవారం సాయంత్రం 6 గంటలకు మీడియాతో మాట్లాడుతూ ఉష్ణోగ్రతలో పెరుగుదల రీత్యా వ్యవసాయ పనివారు, ఉపాధి పనివారు, ఇటుక బట్టి కార్మికులు ఉదయం నుంచి 10 గంటల వరకు సాయంత్రం 3 గంటల నుంచి పొద్దుపోయే వరకు సమయాలను మార్చుకోవాలని ఆమె సూచించారు. వడదెబ్బ తగిలిన వారికి శరీర ఉష్ణోగ్రత పెరుగుతుందని తెలిపారు. ఎండ దెబ్బలో శరీర ఉష్ణోగ్రత పడిపోవడం కానీ.. పెరగడం కానీ జరుగుతుందని ప్రాణాంతకమైన ఈ వడదెబ్బను తప్పించుకునేందుకు చిన్నారులను, విద్యార్థులను, అన్ని వయస్కుల వారిని సాధ్యమైనంత వరకు ఎండ సమయంలో బయట తిరగనీయకూడదని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఎప్పుడూ సిద్ధంగా ఉంచుకోవాలని సమీప ఆశా కార్యకర్తకు ఏఎస్ఎం ద్వారా పీహెచ్‌సీకి తెలియజేయాలన్నారు. తక్షణ వైద్యం అందిస్తే ప్రాణాంతకం కాదన్నారు.

రూ.23 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

చీమకుర్తి: మండల పరిషత్‌కు చెందిన దాదాపు రూ.23 కోట్లతో మండలంలోని పలు గ్రామాలలో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేసినట్లు ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం చీమకుర్తి మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరంలో 383 పనులకు రూ.10.7 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు ఈ సందర్భంగా తెలిపారు. దానితో పాటు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.62 లక్షలను 21 పనులకు మంజూరు చేసినట్లు చెప్పారు. బీటీ రోడ్లకు మొదటి విడతగా రూ.4.5 కోట్లతో 48 పనులను చేపట్టేందుకు పిలిచిన టెండర్‌లు అగ్రిమెంట్ స్టేజిలో ఉన్నాయన్నారు. రెండో విడత రూ.5.73 కోట్లతో 60 పనులకు టెండర్‌లు పిలిచినట్లు తెలిపారు. మండలంలోని 24 పంచాయతీల్లో విద్యుత్ లైన్ సర్వీస్ ఛార్జీలు కింద రూ.1.36 కోట్లు మండల పరిషత్ నిధుల నుంచి చెల్లించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు చెప్పారు. తొలుత మండలంలోని పలు శాఖలకు సంబంధించిన అధికారుల ద్వారా ఆయా శాఖలపై సమీక్షలను నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, ఎంపీడీఓ కె.సీతారామారావు, సర్పంచ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మెక్కలు తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి

నాగులుప్పలపాడు: ఈదుమూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన మెక్కలను అన్యాయంగా తగలబెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలో మంచి ఆహ్లాదకర వాతావరణంతో పాటు పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గ్రామమంతా చెట్లు నాటడంతో పాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పెంచిన చెట్లను అన్యాయంగా తగలబెట్టడం ఏ మాత్రం సమంజసం కాదని తెలిపారు. అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రకృతి సేద్యంతో భవిష్యత్తుకు పునాది



విత్తనాలను ఎంపిక చేస్తున్న విధానంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఒంగోలు రూరల్: భావితరాలు ఆరోగ్యకరంగా ఉండాలన్నా.. భవిష్యత్తు ఆరోగ్యకరంగా ఉండాలన్నా ప్రకృతి సేద్యంపై ఆకర్షితులు కావాలని ఒంగోలు మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు అన్నారు. బొద్దులూరివారిపాలెంలో శుక్రవారం నేచురల్ ఫార్మింగ్ అధికారి రాధా శింగమనేని అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. సారవంతమైన నేల కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పంటలు వేసి రసాయనికి ఎరువులు అధిక శక్తి కలిగిన పురుగు మందులు వేయడం వలన నేల స్వభావం నిస్సారంగా మారుతుందన్నారు. రానున్న ఖరీఫ్, రబీ సీజన్‌లలో అధిక దిగుబడులు పొందేందుకు నవధాన్యాల సాగు, అంతర పంటల సాగు ఎగుమతి చేయగలిగిన స్థాయిలో దుంపగడ్డల సాగు ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. దీంతో నేల ఆరోగ్యం కాపాడుతూ సాగు ఖర్చులు తగ్గుతాయన్నారు. ఇదే సమయంలో ఘనజీవామృతాన్ని ఎకరానికి 400 కిలోలు వేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఒకే పొలంలో అంతర పంటలు, పెరటి మొక్కలు వేయడం వలన 365 రోజులు పలు పంటలతో భూమిని కప్పి ఉంచడమే కాకుండా దిగుబడులు పొందవచ్చన్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు గ్రామంలో వ్యవసాయ క్షేత్రాన్ని కవులకు తీసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. నేచురల్ ఫార్మింగ్ అధికారి రాధా శింగమనేని తనకున్న పొలం విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టారు. రాధా శింగమనేని మాట్లాడుతూ తక్కువ వర్షపాతంలో కూడా విత్తనాల నుంచి మొలకలు వస్తాయని దీనిని పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఒంగోలు మండలంలో ప్రకృతి వ్యవసాయపై ప్రతి గ్రామంలో స్పందన వస్తున్నందుకు నేచురల్ ఫార్మింగ్ అధికారి రాధా శింగమనేనిని ఏవో అభినందించారు. రైతులు, వీఏఏ ప్రీతమ్, లీడ్ ఫార్మర్ పద్మావతి, కార్యదర్శి భారతి పాల్గొన్నారు.

ఉరేసుకుని యువతి ఆత్మహత్య



కొత్తపట్నం: తను తమ్ముడు చనిపోయడని దిగులు చెందుతూ మనస్థాపం చెందిన యువతి ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన మోటుమాల గ్రామంలో చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా, అల్లూరు మండలం, పడమర గోగులపల్లి గ్రామానికి చెందిన పురిణి ఉమా మహేశ్వరి (25)ని 7 ఏళ్ల క్రితం మోటుమాల గ్రామానికి చెందిన పురిణి బ్రహ్మయ్య వివాహం చేసుకున్నాడు. అప్పటి నుంచి వారి జీవితం సజావంగా సాగింది. ఏడాది క్రితం ఆమె తమ్ముడు మతిస్థిమితం లేక ఉరివేసుకొని చనిపోయాడు. దీంతో మనస్తాపం చెంది బాత్‌రూములో శుక్రవారం చీరతో ఉరివేసుకుంది. 108లో ప్రయివేటు హాస్పిటల్‌కు తరలించగా.. అప్పటికే మృతి చెందిందని డాక్టర్ నిర్ధారించారు. ఎస్సై సాంబశివరావు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలున్నారు.

దళిత మంత్రి సురేష్‌పై దాడిని ఖండిస్తూ నిరసన

చీమకుర్తి: దళిత మంత్రి ఆదిమూలపు సురేష్‌పై టీడీపీ చిల్లర కార్యకర్తలు చేసిన దాడిని ఖండిస్తూ శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు పాటిబండ్ల గంగయ్య, గోపురపు చంద్ర, పాలడుగు సుబ్బారావు ఆధ్వర్యంలో చీమకుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం ఇచ్చి తమ నిరసనలను తెలిపారు. శుక్రవారం యర్రగొండపాలెంలో మంత్రి ఆదిమూలపు సురేష్ క్యాంప్ కార్యాలయంపై టీడీపీ నాయకులు చేసిన విధ్వంసంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. నారా లోకేష్ దళితులను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు క్షమాపణలను చెప్పాలంటూ మంత్రి ఆదిమూలపు సురేష్ నేతృత్వంలో వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేశారన్నారు. ప్రతిపక్ష నాయకుడు నారా చంద్రబాబు నాయుడు యర్రగొండపాలెం వస్తున్న సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమమంలో.. దీనిని వ్యతిరేకిస్తూ టీడీపీ మూకలు సురేష్ కార్యాలయంపై చేసిన దాడిని నిరసిస్తూ చీమకుర్తిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఇలాంటి చర్యలు తగవన్నారు.

వాహనదారులకు రూ.3,600 జరిమానా

చీమకుర్తి: చీమకుర్తి బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ఎస్సై రామిరెడ్డి తనిఖీలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిపై కేసు నమోదు చేశారు. దాంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌లు, ఇతర డాక్యుమెంట్లు లేని 20 వాహనాలకు సంబంధించిన వ్యక్తులపై రూ.3,600 అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై మృతదేహం

ఒంగోలు: స్థానిక రైల్వే స్టేషన్‌కు సమీపంలో ఉత్తరం వైపున రైల్వే ట్రాక్‌పై పురుషుని మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుంది. తెలుపురంగు నిండు చేతుల చొక్కా , నాచు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎడమకాలుకు పోలియో ఉంది. అతని వివరాలు గుర్తించిన వారు 9490566577, 9440627647, 949761057 నంబర్లను సంప్రదించాలని ఈ సందర్భంగా తెలిపారు.